

జై శ్రీరామ్.. జై శ్రీరామ్..

● మార్మోగిన రామ నామం ● శోభాయమానం... శ్రీరాముని శోభాయాత్ర ● భక్తులతో కిక్కిరిసిన కడప రోడ్లు



శ్రీరామచంద్రుడి నిలువెత్తు విగ్రహంతో సాగిన శోభాయాత్ర





కడప నగరంలో జరిగిన శోభాయాత్రకు పోటెత్తిన ప్రజలు





కడప (కల్చరల్), జనవరి 21 : కడప నగరం ఆదివారం ఉదయం కాషాయ జెండాలు.. రామ నామంతో మార్మోగిపోయింది. శ్రీరామచంద్రుడి నిలువెత్తు విగ్రహంతో నగరంలో వేలాది మంది భక్తుల నడుమ శోభాయాత్ర వైభవంగా జరిగింది. అయోధ్యలో హిందువుల కల శ్రీరామమందిర నిర్మాణంతో సాకారమవుతున్న వేళ అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు కడప నగరంలోని చిన్నచౌకు వద్ద గల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి నగర పురవీధుల్లో అశేష జనవాహిని మధ్య రామచంద్రమూర్తి నిలువెత్తు విగ్రహంతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు మునుపెన్నడూ కడప నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో శోభాయాత్రలో వేలాదిగా పాల్గొన్నారు. శ్రీరాముని కాషాయ జెండాలు చేతబట్టుకుని కడప నగరంలో శోభాయాత్రలో కదం కదం తొక్కుతూ రామనామం జపిస్తూ భక్తిపారవశ్యం పొందారు. శోభాయాత్ర చిన్నచౌకు నుంచి ప్రారంభమై అప్సరా సర్కిల్, వై-జంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, నెహ్రూపార్కు, అన్నమయ్య, క్రిష్ణాసర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్, పాతబస్టాండు, ఏడు రోడ్ల ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటీఐ, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌పార్కు మీదుగా హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండరామాలయానికి రాత్రి 8 గంటలకు చేరుకుంది. నగరంలో శోభాయాత్ర సాగిన అన్నిచోట్ల పలువురు భక్తులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా రహదారుల వెంబడి టిఫిన్లు, భోజనాలు, అల్పాహారం, మజ్జిగ, మంచినీరు, టీలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనరు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథరెడ్డి, మునగా సతీష్‌కుమార్, బాలక్రిష్ణయాదవ్, టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, టీడీపీ నాయకులు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, దుర్గాప్రసాద్, బీజేవైయం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, జిల్లా కార్యదర్శి త్రివిక్రమ్‌యాదవ్‌లతో పాటు అయోధ్య ఐక్యవేదిక కమిటీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయం

● ప్రభుత్వ భూముల్లో కట్టడాలకు ఎమ్మెల్యే రాచమల్లు ఊతం ● ఏటి పొరంబోకు భూమి కొనుగోలుకు రూ.75 లక్షల విరాళం
● రెవెన్యూ అధికారుల ఆక్షేపణ ● పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరిక



ఏటి పొరంబోకు భూమి కొనుగోలుకు విరాళం ఇచ్చినట్లు ఫ్లెక్సీలు వేసిన సగర సంఘం నేతలు



ఏటి పొరంబోకు భూములను పరిశీలిస్తున్న ఎర్రగుంట్ల రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 21: ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే.. వాటిని ప్రజా ప్రతినిధులుగా సంరంక్షించాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాత్రం ఏకంగా తన ఓటు బ్యాంకు రాజకీయ లబ్ధికోసం మున్సిపాలిటీ స్థలాలు, ఏటి పొరంబోకు భూముల్లో అక్రమ కట్టడాల నిర్మాణానికి ఊతమిస్తున్నారు. వాటి కొనుగోలుకు రూ.75 లక్షలు విరాళం ఇచ్చి అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ప్రొద్దుటూరు పట్టణ శివారులోని పెన్నా నదీ తీరం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెంబరు 901/1లోని 1.25 ఎకరాల భూమిలో సగర కులస్థులకు కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కోసం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి రూ.75 లక్షలు విరాళం ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సగర కులస్థులు పెద్ద ఫ్లెక్సీలు, టెంట్లు వేసి ఆదివారం రెడ్ల కల్యాణ మండపం ఆవరణలో బహిరంగ సభను ఏర్పాటు చేసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ భూముల్లో కార్యక్రమం గురించి తెలిసి ఎర్రగుంట్ల డిప్యూటీ తహసీల్దారు వెంకట రమణారెడ్డి, ఆర్‌ఐ తరుణ్, వీఆర్‌వో మహేష్‌బాబు, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, విలేజ్ సర్వేయర్ చంద్రకళలు అక్కడికి చేరుకుని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇది ఏటి పొరంబోకు భూమి ఇక్కడ నిర్మాణం చేపట్టరాదని హెచ్చరించారు. ఇందుకు నిర్వాహకులు ఇక్కడ అనేక కట్టడాలు వుంటే వాటి మీద చర్యలు తీసుకోకుండా మాపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. అయినా మేము పనులు చేపట్టడం లేదని కేవలం సభ పెట్టుకుంటున్నామని తెలిపారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ అక్రమ కట్టడాలన్నింటికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇక్కడ పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వెళ్లారు.

నేతల అండతో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం

అటు ఎర్రగుంట్ల మండలం ఇటు ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఏటి పొరంబోకు భూముల్లో రెడ్ల కళ్యాణ మండపం, బలిజ కళ్యాణ మండపాలతో పాటు హెల్త్ క్లబ్బులు,పెయిడ్ వృద్ధాశ్రమాలు, ఆలయాలు, వాటర్‌ప్లాంట్లు, హోటళ్లు, వందలాది కట్టడాలు నిర్మించారు. వీటిని రెవెన్యూ అధికారులు గతంలో అడ్డుకోకపోవడం.. చట్టపరంగా చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఇదే అదనుగా ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం రాజకీయ నేతలు పెన్నా పొరంబోకు భూముల్లో కట్టడాలకు ప్రోత్సహిస్తున్నారు. ప్రొద్దుటూరు మండలం రామేశ్వరం పొలం సర్వే నెంబరు 218/1లో 848.52 ఎకరాల ఏటి పొరంబోకు వుంది. అందులో ఇప్పటికే వందలాది అక్రమ కట్టడాలు నిర్మించారు. ఇటీవల కాలంలోనే మైనారిటీ వర్గాలకు చెందిన ప్రార్థన మందిరం నిర్మాణం కోసం పనులు చేపడితే రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వారిపై ఏకంగా అధికార పార్టీకి చెందిన వారు దాడులకు సైతం తెగబడ్డారు. పరుష పదజాలంతో దూషించారు. దీనికి వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యే హస్తం వుండటంతో రెవెన్యూ అధికారులు వారిపై కేసు పెట్టడానికి వెనుకాడారు.

అమలుగాని సుప్రీం కోర్టు ఉత్తర్వులు

ప్రభుత్వ భూములు, వాగులు వంకలు, ఏటి పొరంబోకు భూమలు ఆక్రమిస్తే వెంటనే చర్యలు తీసుకొని వాటిని తొలగించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా.. వాటిని అమలు చేసే నాథుడే లేరు. దీంతో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మండలాల్లోని ఏటి పొరంబోకు అటవీ భూమలుల్లో వందలాది కట్టడాలు నిర్మిస్తున్నారు. కానీ వీటిని తొలగించకపోవడం, విద్యుత్ సరఫరా కూడా నిలిపి వేయకపోవడంతో వారు ఏకంగా కోట్లాది రూపాయలతో విక్రయాలు సైతం జరుపుతున్నారు.

కడప మార్కెట్ యార్డులో మళ్లీ మొదలైన వివాదం

● బంద్‌కు పిలుపునిచ్చిన పసుపు వ్యాపారుల సంఘం ● నేటి నుంచి కొనుగోళ్ల నిలిపివేత
● శీతల గిడ్డంగి పనులు నిలుపుదల చేయించాలని డిమాండ్



కడప మార్కెట్ యార్డు

కడప(రూరల్) జనవరి 21: కడప మార్కెట్ కమిటీ పసుపు యార్డులోని 16/329 నెంబర్‌లోని గిడ్డంగి వివాదం మళ్లీ మొదలైంది. పసుపు యార్డు పరిధిలోని సదరు గిడ్డంగిని డి.ఫిరోజ్ అలీఖాన్, డి.నిషార్, అహ్మద్ అలీఖాన్ తదితరులు కొనుగోలు చేసి అక్కడ పండ్లను నిల్వ ఉంచుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్)గా మార్చేందుకు పనులను చేపడుతున్నారు. ఈమేరకు పసుపు మార్కెట్ యార్డులో పండ్లను నిల్వ ఉంచుకొనే శీతల గిడ్డంగి పనులు చేపట్టరాదని పసుపు వ్యాపారుల సంఘం ఏజెంట్లు ఆక్షేపించారు. ఈ సమస్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పరిష్కారం కాలేదు. ఈ మేరకు ఇరు పక్షాలు కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా కోర్టు తీర్పు తమకు అనులంగా వచ్చిందని.. ఈ మేరకు శీతల గిడ్డంగి పనులను నిలుపుదల చేయించాలని పసుపు వ్యాపారుల సంఘం సంబంధిత అధికారులకు సూచించింది. కానీ ప్రయోజనం లేకపోవడంతో సోమవారం నుంచి బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ బాల వెంకటరెడ్డికి మోమోరాండం అందజేశారు. దీంతో నేటి నుంచి మార్కెట్‌యార్డులో పసుపు కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. సదరు గిడ్డంగిలో పసుపు, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు లావాదేవీలను మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ నెరవేర్చే వరకు పసుపు కొనుగోళ్లను చేపట్టేదిలేంటున్నారు.

సమస్య పరిష్కారం అయ్యే వరకు పసుపు కొనుగోళ్లు నిలిపివేత

తాము ఫిర్యాదు చేసిన పసుపు యార్డులోని 16/329 గిడ్డంగి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు యార్డులో పసుపు కొనుగోళ్లు చేపట్టేది లేదని పసుపు వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. రామకృష్ణారెడ్డి, కోశాధికారి గుర్రం కొండ మహేష్ తెలిపారు. ఈమేరకు సోమవారం నుంచి పసుపు కొనుగోళ్లను నిలుపుదల చేస్తున్నామన్నారు.



బంద్ చేపడుతున్నట్లు కడప మార్కెట్ యార్డు సెక్రటరీకి వినతి అందజేస్తున్న పసుపు వ్యాపార సంఘం నేతలు

ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి చర్యలు

● నేడు, రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
● జేడీ డాక్టర్ శారదమ్మ

కడప(రూరల్) జనవరి 21 : ఉమ్మడి కడప జిల్లాలో 210 అనిమల్ హస్బండరీ అసిస్టెంట్(ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించింది. నాలుగు రోజుల క్రితం మెరిట్ లిస్టును కూడా విడుదల చేశారు. ఈ మేరకు ఉమ్మడి కడప జిల్లా యూనిట్‌గా కడప పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జనవరి 22, 23వ తేదీల్లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియను సంబంధిత అధికారులు చేపట్టనున్నారు. ఇందుకోసం 5 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంపికైన వారికి 24, 25వ తేదీలల్లో నియామక పత్రాలను అందజేయనున్నారు. తదుపరి ఫిబ్రవరి 1వ తేదీ తరువాత కొత్త ఏహెచ్‌ఏలకు పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇక ప్రస్తుతం ఏహెచ్‌ఏలుగా పనిచేస్తున్న వారి బదిలీలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. కాగా, నియామక ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపడుతున్నట్లు జేడీ డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు.

జగన్ పాలనలో.. ఇదీ పల్లె ప్రగతి

● అభివృద్ధి పనులకు ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు
● రోడ్డు లేక దమ్మనపల్లె ప్రజల అవస్థలు
● ఊరుమారిందంటూ వైసీపీ సొంత డబ్బా



కంకర తేలిన మెయిన్ రోడ్డు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ఊరు మారింది.. పల్లెలకు పండుగొచ్చిందంటూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారు. సొంత పత్రికకు పెద్ద ఎత్తున ప్రకటనలూ ఇస్తున్నారు. సొంత డబ్బా తప్ప.. సొంత జిల్లాలోనే చాలా పల్లెల్లో ఇప్పటికీ కనీసం సరైన రోడ్డులేక అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే పల్లెల్లో సైతం నాలుగున్నరేళ్లగా జగన్ పాలనలో అభివృద్ధి పనులకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు.

జిల్లాలోని పోరుమామిళ్ల మండలం దమ్మనపల్లెలో 250 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ రైతులు, రైతు కూలీలు ఉన్నారు. వ్యవసాయం, పొలం పనులే వీరికి జీవనాధారం. అయితే ఈ పల్లెలో ఇంతవరకు ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు. దమ్మనపల్లె పంచాయతీ హెడ్‌క్వార్టరు. ఇక్కడికి మంజూరైన సచివాలయాన్ని నుంకేసులపల్లెలో నిర్మించారు. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లు తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరోడ్డూ వేయలేదు. రోడ్లు సరిగా లేక జనాలు అవస్థలు పడుతున్నారు. కడప, విజయవాడ రహదారి నుంచి ఐదు కి.మీ మేర మట్టిరోడ్డు ఉంది. ఇదంతా దెబ్బతిని గుంతలమయంగా మారింది. వాహనాలు కాదు కదా.. కనీసం నడవలేని విధంగా తయారైంది. రోడ్డు వేయించమని మొత్తుకున్నా స్పందన లేదు.

ఇక పైపులైను లేక తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పైపులైను లీకేజీ అయి బురదమయంగా మారింది. నేరుగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ లేకపోవడంతో గ్రామస్తులు పైపులు వేసుకుని నీళ్లు పట్టుకుంటున్నారు.

గ్రామం పక్కనే తెలుగుగంగ ప్రధాన కాల్వ వెళుతుంది. అయితే మెయిన్ కాల్వలో జమ్ము పెరగడంతో నీళ్లు అందడం లేదు. దీంతో దాదాపు 150 ఎకరాలకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. జమ్ము తొలగించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోని పరిస్థితి. జమ్ము కంకుల నుంచి సన్నటి రేణువులంతా గాలికి వచ్చి ఇళ్లల్లోకి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ఎలాంటి పనులు చేపట్టలేదని గ్రామస్తులు వాపోతున్నారు.



పోరుమామిళ్ల మండలం దమ్మనపల్లె వద్ద తెలుగుగంగ కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము



పైపులైను లీకేజీతో తాగునీటి కొళాయి వద్ద మురికినీరు

క్రీడలు ప్రతి ఒక్కరికి అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్)జనవరి 21: క్రీడల తో ఆరోగ్యం పొందడంతో పాటు, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి తెలిపారు. కడప నగరం పక్కీరు పల్లెలోని పీవీఆర్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్‌లో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో జడ్జి మాట్లాడుతూ విధి నిర్వహణలో తీరిక లేకుండా కొనసాగుతున్న న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగుల్లో బ్యాడ్మింటన్ పోటీలు నూతనోత్తేజాన్ని నింపుతాయన్నారు. ఈ పోటీలలో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకమన్నారు. విజేతలకు రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, ఇతర న్యాయమూర్తులు ఇంతియాజ్ అహమ్మద్, ఎస్. బాబాపక్రుద్దీన్, ఎం. ప్రదీప్‌కుమార్‌లతో పాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగమునిరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వ రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగామునిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంటు కృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం అమలు చేసిన పీఆర్సీలో మాత్రమే పెన్షనర్లకు ఉన్న వసతులు తగ్గించడం జరిగిందన్నారు. వీటిని తిరిగి పొందుపరచాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

30 నుంచి బ్రహ్మంగారి దేవస్థానంలో హక్కుల వేలం

బ్రహ్మంగారిమఠం, జనవరి 21: జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో జనవరి 30, 31 తేదీల్లో వివిధ రుసుములు వసూలు చేసుకునే హక్కులను వేలం వేస్తున్నట్లు ఫిట్ పర్సన్ సి.శంకరబాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. కొబ్బరి చిప్పలు వసూలు హక్కునకు రూ.3.50 లక్షలు, పోలేరమ్మ వద్ద టెంకాయలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష, పోలేరమ్మ వద్ద కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు రూ.75వేలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.75వేలు, మఠంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.50వేలు, పాదరక్షల భద్రపరిచే హక్కు రూ.50వేలు, డార్మిటరీ హాలు లాకర్ టీటీఈ వసూలు హక్కుకు రూ.లక్ష, తలవెంట్రుకల సేకరణకు రూ.25 లక్షలు ధరావతు డీడీ రూపంలో కానీ, నగదు రూపంలో కానీ చెల్లించి, వివరాలు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఆయా హక్కులు ఒక సంవత్సరం పాటు ఉంటాయని వివరించారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : త్వరలో ప్రకటించనున్న డీఎస్సీలో ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని రూటా వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌసలాజంను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు డీఎస్సీలో అయినా ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్తార్‌ఫైజి, సిరాజుద్దీన్, మహ్మద్ ఆయుబ్, జుబేర్ అహ్మద్, యూనస్, తయ్యబ్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మదనపల్లె, జనవరి 21: మదనపల్లె రూరల్ మండలం వేంపల్లె ఎస్సీ కాల నీలో ఆదివారం బారత రాజ్యాంగ ని ర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్ర హావిష్కరణ ఘనంగా నిర్వహించారు. భారతీయ అంబేడ్కర్ సేన(బాస్)తో కలిసి ఎస్సీ కాలనీవాసులు విగ్రహావి ష్కరణ మహోత్సవం నిర్వహించారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, డీఎస్పీ కేశప్ప, బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్, విగ్రహ కమిటీ ఛైర్మన్ చాట్ల బయన్న, బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, చీకిలబైలు బాబురెడ్డిలు విగ్ర హాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ గొప్ప రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అదెమ్మ, ఎంపీటీసీ సుభారా ణి, కౌన్సిలర్ రేణుకమ్మతో పాటు విగ్రహ కమిటీ సభ్యులు వెంకటరమణ, సురేష్, కళ్యాణ్, రెడ్డి, సురేష్, బాబు, జయప్రకాష్, వెంకటేష్, బాస్ నాయకులు లక్ష్మీనారా య ణ, రెడ్డిప్రసాద్, సూరి, శశికుమార్, పీర్‌బాషా, రత్నం, రాజేష్ పాల్గొన్నారు.

వాల్మీకులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న పులిశ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: వాల్మీకులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆసంఘం వ్యవస్థాపకుడు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ నెల 28న మదన పల్లెలో వాల్మీకి సంఘం కార్యాలయం ప్రారంభోత్సవానికి వాల్మీకి కుటుంబసభ్యులు తరలిరావాలని ఆయన కోరారు. ఆదివారం స్థానిక వాల్మీకినాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల విద్య, వైద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాం స్కృతికంగా చైతన్యం తీసుకు రావాలంటే వాల్మీకుల ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధుల మెడలువంచి వాల్మీకికు ఎస్టీ పునర్ధరణ చేయడానికి ప్రతి ఒక వాల్మీకి నడుము బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి నాయ కులు సద్దల జయసింహా, వలసల మంజునాథ్, నరసింహులు, నిర్మలమ్మ, శ్రీనివాసులు, అర్జున్, రమణ, జయరామ్, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పైరుకు బింగి.. రైతుకు బెంగ

● దారుణంగా పడిపోయిన దిగుబడులు.. ● కోత కూలీలు దక్కని వైనం.. ● తీవ్రంగా నష్టపోయిన అన్నదాత


పుల్లీడు గ్రామంలో రాశిగా పోసిన పండుమిర్చి


బింగి తెగులు సోకిందని చెబుతున్న మహిళా రైతు లక్షుమ్మ

పోరుమామిళ్ల, జనవరి 21: వాణిజ్య పంటలు సాగు చేస్తే నాలుగు రూకలు చేతికంది తమ కష్టాలు దూరమవుతాయని ఆశించిన రైతులకు అకాల వర్షాలు, తెగుళ్ల వెన్ను విరిచాయి. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో, చిన్నపుల్లీడు, పెద్దపుల్లీడు గ్రామాల్లోనే వంద ఎకరాలకు పైగా, దమ్మనపల్లె, గానుగపెంట, గురప్ప గారిపల్లెల్లో 200 ఎకరాల దాకా సాగు చేశారు. ఎకరాకు దాదాపు లక్ష నుంచి లక్షా 20వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని ఆశించారు. అయితే, పంటకు బింగి తెగులు సోకడంతో కొన్ని ప్రాంతాల్లో పది క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. మరికొన్ని పొలాల్లో పంట కోసిన కూలీలకు కూడా డబ్బులు రావని భావించి అలాగే వదిలేశారు.

పుల్లీడు గ్రామంలో లక్షుమ్మ కుమారులు మూడు ఎకరాల్లో పండు మిర్చి సాగు చేస్తే బింగి తెగుళ్ల కారణంగా చెట్లు ముడుచుకు పోవడం, మిర్చి రంగు మారడంతో ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు వాడినా ఈ తెగుళ్ల ఉధృతి తగ్గించలేకపోతున్నామని ఆ వృద్ధురాలు వాపోయింది. చిన్న పుల్లీడుకు చెందిన బాలిరెడ్డి ఐదెకరాల్లో దాదాపు రూ.5ల క్షలకు పైగా పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే కూలీలకు కూడా డబ్బులు వచ్చే పరిస్థితి లేదని అందుకే అలాగే పంటను వదిలేశామన్నారు. మద్దిరెడ్డి అనే రైతు ఎకరా పొలంలో లక్షకు పైగా పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే కూలీలు కూడా రావని భావించి అలాగే వదిలేసినట్లు తెలిపారు. త్వరలో ఈ పంటలు దుక్కి దున్ని టిల్లర్ కొట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా, మూడేళ్లుగా మిర్చికి తెగుళ్ల సోకుతున్నాయని రైతులు కాంప్లెక్స్ ఎరువులు వాడకుండా ప్రైవేటు కంపెనీ వారు చెప్పిన మందులు వాడడం వల్ల తెగుళ్లను నియంత్రించలేకపోతున్నామన్నారు. ఉద్యానశాఖాధికారుల సంప్రదించి వారి సలహాలు పాటిస్తే తెగళ్లను కాస్త నివారించవచ్చన్నారు. ప్రస్తుతం క్వాలిటీ బట్టి మిర్చికి రూ.16వేల నుంచి రూ.22వేల వరకు ధర పలుకుతోందన్నారు.

'అమ్మఒడి పేరుతో పన్నుల బాదుడు'


సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

కడప (మారుతీనగర్), జనవరి 21: అమ్మఒడి పేరుతో వైసీపీ ప్రభుత్వం పన్నుల రూపంలో అన్ని వర్గాల ప్రజల నడ్డి విరుస్తోందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దృఢం రెడ్డిబాబు ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరిగిన అన్ని సార్వత్రిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతికొద్ది మంది జనాభా గల అగ్రవర్ణాల చేతుల్లో రాజ్యాధికారం బందీ అయిందన్నారు. నేటికీ ఎక్కువ జనాభా గలిగిన వర్గాలు పల్లకీలు మోసే బోయీలుగా అగ్రవర్ణాల అహంకార మదానికి బలవుతున్నారన్నారు. జనాభా దామాషాప్రకారం చట్టసభల్లో 54 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, దేశ వ్యాప్తంగా కుల జన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కళాక్షేత్రంలో నిర్వహించిన బీసీ గర్జన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జి.లక్ష్మిరెడ్డి, అమీర్ బాబు, కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, నాయకుడు కత్తి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్ మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ పన్ను, కరెంటు పన్ను, చెత్త పన్ను, ఆటోలపై రిజిస్ట్రేషన్ బాదుడు, పెట్రో,డీజలు, గ్యాస్ ధరల పెంపుతో ప్రజలు తీవ్ర నరకయాతన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి, అధికారం చేపట్టగానే పన్నుల బాదుడుతో ప్రజలకు ప్రత్యక్షంగా నరకం చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వలస పోతున్నారని, వీరితో పాటు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు తరలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో సరైన విద్యాబోధన లేక ప్రైవేటు పాఠశాలల్లో చదివిద్దామంటే ఫీజులు కట్టలేక పేదలు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం, అభివృద్ధి లేకపోవడంతో ప్రజలు సతమతమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులేమో లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడమే పనిగా పెట్టుకుని వారి ఆదాయ వనరులను పెంచుకుంటున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీసీ-ఏలో ఉన్న కులాలకు ఎస్టీ హోదా కల్పించాలన్నారు. అలాగే బీసీ-డిలో ఉన్న కులాలను బీసీఏలోకి చేర్చాలన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయరు ఎత్తివేయాలని, చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీల సత్తా ఏంటో రుచి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ టీడీపీ కార్యదర్శి సుంకర నాగేశ్వర్ రావు, ఏపీ బీసీ మహాసభ జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు బాలకృష్ణయాదవ్, సంఘం సేవకులు సలావుద్దీన్, దళిత నాయకులు సంగటి మనోహర్‌తో పాటు పలువురు ఏపీ బీసీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.ట

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆశ వర్కర్ల జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు మాతా శిశుమరణాల నివారణకు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో వారు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించినా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారి శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. ఆశ వర్కర్ల వేతనాలు కూలీల వేతనం కన్నా తక్కువ అని, చాలీచాలని వేతనాలతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వారికి సామాజిక భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. హక్కుల కోసం ఉద్యమిస్తే ఎస్మా చట్టం పేరుతో బెదిరిస్తోందని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి మాట్లాడుతూ ఆశ వర్కర్లను పర్మనెంట్ చేసి రూ.26వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సెలవులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. కనీస వేతనంతోపాటు రిటైర్మెంట్ ప్రయోజనం రూ.5లక్షలు, గ్రాట్యుటీ, రూ.10వేలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మరణించిన ఆశ వర్కర్లకు రూ.10లక్షల ప్రభుత్వ బీమా, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, చంద్రశేఖర్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన, సునంద, అమ్ములు, రమణమ్మ, మంజులవాణి, శోభారాణి, సరళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసిన మహనీయుడు లెనిన్


లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐనాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: ప్రపంచానికి సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసిన మహనీయుడు వీ ఐ లెనిన్ అని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీయూ కార్యాలయంలో ప్రపంచ విప్లవ కారుడు లెనిన్ శత జయంతి ఉత్సవాలను మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీ ఎల్‌నరసింహులు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడి దారీ వ్యవస్థ మానవ మనుగడకే ప్రమాదమని. ఇది కొనసాగినన్ని రోజులు దోపిడీ కొనసాగుతుందని తెలియజేశారు. ఈ సమాజం మారితేనే ప్రజలకు దోపిడీ నుంచి విముక్తి అభిస్తుందన్నారు. రష్యా పెడరేషన్‌లో మార్క్సిస్టు విప్లవపోరాటంతో శ్రామిక పోరాటాన్ని నడిపి సోషలిస్టు సమాజాన్ని స్థాపించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ సమాజం రెండు శతాబ్దాలు పయనించిన నేటికి పేదరికం, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం తొలగిపోలేదన్నారు. మనదేశంలో కుల, మతాలపై రాజకీయాలు చేస్తూ మనుష్యుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళాసంఘం జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు లీలావతి, సిపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, తిరుమల, దేవ, సూరి, రెడ్డి, శోభ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శీన, నవీన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

చెన్నూరు, జనవరి 21 : జీవితంపై విరక్తితో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

మండలంలోని కనుపర్తికి చెందిన వరలక్ష్మి (57) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో విరక్తి చెందిన ఆమె ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ బయటికి వెళ్లే సమయంలో స్థానికులు ఆమెను గమనించారు. అయిత పొలం వద్దకు వెళుతోందనుకుని మిన్నకుండిపోయారు. కాగా, కొందరు మహిళలు ఆమె బావిలో దూకడాన్ని దూరం నుంచి గమనించి, అక్కడికి వచ్చే లోగానే ఆమె మృతి చెందింది. వారు అందించిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

వాహనాల తనిఖీల్లో రూ.22 లక్షలు స్వాధీనం

బద్వేలు టౌన్, జనవరి 21 : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అర్బన్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగాగా వేపరాల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి వాహనంలో రూ.8ల క్షలు, తమిళనాడు రాష్ట్రం తగ్గట్టి గ్రామానికి చెందిన రాజముహి అనే వ్యక్తి వాహనంలో రూ.14 లక్షలు నగదు గుర్తించారు. ఈ నగదుకు సంబధించి ఎలాంటి బిల్లులు, పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, జనవరి 21: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యాడు. పెద్దఓరంపాడు గ్రామ పంచాయతీ బెస్తపల్లె అరుంధతివాడకు చెందిన సురేంద్రబాబు (55) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, చిన్నఓరంపాడు ముక్కావారిపల్లె మధ్యలో కారు ఢీకొంది. దీంతో ఆయన మణికట్టు విరగడంతోపాటు తలకు గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. క్షతగాత్రుడిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

సుండుపల్లె, జనవరి 21: మామిడి తోటలో మేతకు వెళ్లిన ఓ ఆవు ఆదివారం విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. తమను ఆదుకోవాలని ఆవు యజమాని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికీ వాసి బాలాజీనాయక్‌కు అధికారులను కోరుతున్నాడు. ఈ విషయం పశుసంవర్థకశాఖ అధికారి విజయ్‌కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం రాదని తెలిపారు. గతంలో పాడి ఆవు చనిపోతే రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించేదన్నారు. ప్రస్తుతం ఆ పథకం ప్రభుత్వం తొలగించడంతో నష్ట పరిహారం అందదని వివరించారు.

బకాయిల చెల్లింపులో అలసత్వం తగదు

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు

రాయచోటిటౌన్, జనవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం మొండి వైఖరి సరైనది కాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ అవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్లు, సరెండర్ లీవ్ బకాయిలు, ఏపీ జీఎల్ఐలోన్లు, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసినా, వేలాది కోట్ల రూపాయలు ఇంకా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై పలుసార్లు వివిధ రూపాల్లో ఆందోళన చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు విమర్శించారు. 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలే పెండింగ్ ఉండగా, ఆర్భాటంగా 12వ పీఆర్సీ వేశారే తప్ప ఆ కమిటీ విధి విధానాలు రూపొందించకపోవడం, వారు తమ కార్యకలాపాలు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాకులను మోసం చేయడం తప్ప మరోటి కాదన్నారు. ఇప్పటికైనా బకాయిల స్మెంటినీ చెల్లించి, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు హేమలత, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ్ బాషా, భాస్కర్‌రెడ్డి, పురం వెంకట్రమణ, దావూద్, ఆదినారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మస్తానయ్య, రమణయ్య, అజ్మతుల్లా, నీలేశ్, సంకా ప్రసాద్, సుబ్రమణ్యం, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజారమేశ్, మండల సహాధ్యక్షులు పఠాన్ రఫీఖాన్, చిన్నమండెం మండలం సహాధ్యక్షుడు కిఫాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి భస్మాసురుడుగా మారిన జగన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ● వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలు


బద్వేలు టౌన్, జనవరి 21 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి భస్మాసురుడులా మారాడని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లెలో వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారిని విజయ మ్మ, రితీష్‌కుమార్‌రెడ్డిలు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై వారు టీడీపీలో చేరారన్నారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి నిరంకుశ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని దీంతో వ్యవస్థలు సైతం దెబ్బతిన్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలు వైసీపీ పాలనలో విసిగిపోయాయని వారు తెలిపారు. ఒక్క చాన్స్ అంటూ సీఎం పీఠం ఎక్కిన జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. వైసీపీ అరాచక పాలనను రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలన్నారు. మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి టీడీపీ విజయంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహ నాయుడు, చెన్నక్రిష్ణరెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, శివయ్యస్వామి, చరణ్, కుమార్, వెంకటరమణ, పెంచలయ్య, ప్రసాద్‌నాయుడు, సుధాకర్, మాచుపల్లె లక్ష్మిదేవి పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి

మదనపల్లె టౌన్, జనవరి 21: పాతకక్షలతో ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేశారు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని సీటీ ఎం-1 పంచాయతీ పడమట వీధికి చెందిన రఘునాథరెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డి(35) శనివారం రాత్రి వీధిలో వెళుతుండగా వెనక నుంచి కర్రలతో దాడి చేసి పారిపోయారు. బాధితుడు ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. వినాయచవితి సందర్భంగా జరిగిన వాగ్వాదంతో తనపై కక్ష పెంచుకుని హుస్సేన్, కాలేషా దాడి చేశారని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతికత కమలాపురం ఎమ్మెల్యేకు లేదు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు


మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి. శ్రీరాములు

కడప(కలెక్టరేట్), జనవరి 21: కాంగ్రెస్ పార్టీ హయాంలో జడ్పీ వైస్ ఛైర్మన్, మేయర్ లాంటి పదవులు పొందిన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి తల్లి లాంటి ఆ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించడం అర్థ రహితమన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే నీ రాజకీయ ప్రస్థానం సాగిందనే విషయాన్ని మరిచి పోవద్దన్నారు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా కాంగ్రెస్‌ను తక్కువ చేసి మాట్లాడవద్దన్నారు. మరో 10 రోజుల్లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ జిల్లా పర్యటన ఉంటుందని, ప్రతి కార్యకర్తను ,నాయకులను కలుస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ పొట్టి పాటి చంద్ర శేఖర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు అలీఖాన్, ధ్రువకుమార్‌రెడ్డి, పాలగిరి శివ,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందాల రాముడు.. సుగుణాల ధాముడు

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 21 : రామ భక్తుల ఆధ్వర్యంలో భారీగా కులమత బేధం లేకుండా కమలాపురంలో ఆదివారం అయోధ్య రాముని శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామ చావిడి వద్ద నుంచి వేలాది మంది శ్రీరాముని భక్తులు ర్యాలీగా నిర్వహించారు. గ్రామచావిడి నుండి మూడురోడ్ల కూడలి వరకు భారీగా బైకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులచే సీతారామ లక్ష్మణ ఆంజనేయ వేషధారణలు వేసి దారి పొడవునా భారీగా బాణసంచా పేల్చుతూ శ్రీరామ నామాన్ని స్మరిస్తూ భారీగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధికంగా మహిళలు పాల్గొన్నారు.

నేడు రామాలయాల్లో విశేష పూజలు

చెన్నూరు, జనవరి 21: అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిమూలం వెంకటసుబ్బయ్య, మాదినేని రామసుబ్బయ్య, అతికారి రవికుమార్‌లు తెలిపారు. ఈ మేరకు చెన్నూరులో ఆదివారం వారు మాట్లాడుతూ రామునికి ప్రత్యేక పూజలు, అలంకారాలు చేశారు. అన్న ప్రసాద వితరణ, భజనలు, కీర్తనలు నిర్వహిస్తామన్నారు.అంతేకాక 1992లో బాబ్రి మసీదు కూల్చేందుకు కరసేవకులుగా తరలివెళ్లి కష్టనష్టాలు పడ్డ నాటి ఆర్‌ఎస్‌ఎస్ భజరంగ్‌దల్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ కార్యకర్తలందరికీ నేడు చెన్నూరులో సన్మానాలు ఉంటాయన్నారు.

రామాలయాలకు పట్టువస్త్రాలు అందజేత

వేంపల్లె, జనవరి 21: వేంపల్లెలోని రామాలయాలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆదివారం అందించారు. ఆయన మాట్లాడుతూ 500సంవత్సరాల రామభక్తుల కల సోమవారం నెరవేరబోతోందన్నారు. ఆధ్యాత్మిక వేత్తలు వివిధ రకాలుగా ఉద్యమాలు చేసి సుమారు 4.50లక్షల మంది ప్రాణత్యాగం చేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ చొరవతో అందరిని ఒప్పించి సుప్రీంకోర్టులో సాక్ష్యాలను చూపించి వారి ఆదేశాల మేరకురామమందిర నిర్మాణం పూర్తిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మ, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, దొంతు సుమన్,సురేష్, నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో భారీగా అన్నదానం

కడప (కల్చరల్), జనవరి 21 : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాపురం ఎంపీపీ గడికోట జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్పీ బంగ్లా సమీపంలో భారీ అన్నదానం నిర్వహించారు. శోభాయాత్రలో వేలాది మంది శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.



కడప నగరంలో నిర్వహించిన శ్రీరాముని శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు



శోభా యాత్రలో పాల్గొన్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, పసుపులేటి నాగేంద్ర



కడప నగరంలో శ్రీరాముని శోభా యాత్రలో పాల్గొన్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి దంపతులు



శోభా యాత్రలో పాల్గొన్న టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి





యాత్రలో పాల్గొన్న తుంగా రమణయ్య, వెంకటేష్



శోభా యాత్రలో పాల్గొన్న సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రబాబు సభ విజయంపై నాయకుల హర్షం

● మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం



చెన్నూరులో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

చెన్నూరు, జనవరి 21 : కమలాపురంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో జరిగిన రా కదలిరా సభ విజయవంతం కావడంతో చెన్నూరు మండల టీడీపీ నేతల్లోఆనందోత్సాహాలు వెల్లువిరుస్తున్నాయి. ఈ మేరకు ఆదివారం చెన్నూరులో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో టీడీపీ కోసం కష్టపడింది ఒక ఎత్తయితే ఇకపై మరింతగా కష్టపడబోతున్నామన్నారు. పైగా గతంలో నిర్వహించిన బాదుడే బాదుడు ఇప్పుడు నిర్వహిస్తున్న భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజల్లోకి వెళ్లి టీడీపీపై మరింత ఆదరణ పెరిగేలా చేశాయన్నారు. కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సారథ్యంలో మండలంలో రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయ బావుటా ఎగురవేయబోతోందన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పైగా అన్ని వర్గాల్లో రోజురోజుకూ టీడీపీ ఆదరణ ఎంతో పెరుగుతుందన్నారు. ముఖ్యంగా చెన్నూరుతో పాటు రామనపల్లె, కొండపేట, ఉప్పరపల్లె గ్రామాల్లో పార్టీ ఎంతో బలోపేతమైందన్నారు. రాబోవు ఎన్నికల్లో మండలం నుంచి పుత్తా నరసింహారెడ్డికి ఎన్నడూ లేని మెజార్టీని తాను సాధించి పెడతామని, ఇందుకు పసుపు సైనికులంతా నిరంతరం కష్టపడుతున్నారన్నారు. మండలం నుంచి చంద్రబాబు సభకు పసుపు దండు అత్యధికంగా తరలివెళ్లడం ఆ సభ విజయంలో చెన్నూరు మండలం మరింతగా కష్టపడడం ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లానేత షబ్బీర్ హుసేన్, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, కార్యదర్శి పాలగిరి సుదర్శన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, బలిజ సంఘం నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, బీసీ నేతలు ఆటో బాబు, గోదిన శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, మైనార్టీ సెల్ కార్యదర్శి మంజూరు అహ్మద్, కొండాల చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్‌పీర్, యువనేత క్రిష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే...

లింగాల, జనవరి 21: ఆరోగ్య సూత్రాలను పాటించడం వలన మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉంటుందని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ ప్రజలకు సూచించారు. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సరం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరాన్ని కొనసాగించారు. గ్రామంలో పశువైద్యశిబిరం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. పశువులకు గాలికుంటు టీకాలు, పీపీఆర్ టీకాలు, ఎఫ్‌అండ్‌డి టీకాలు, నట్టల నివారణ మందు, కొన్ని గర్భ నిర్ధారణ పరీక్షలు, జనరల్ కేసులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్య సహాయకులు మహమ్మద్ యూనస్, సుబ్బరాయుడు, ధనుంజయరెడ్డి, నరేంద్ర, నరేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకోవడం అభినందనీయం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి, కార్యవర్గసభ్యుడు పెద్దిరెడ్డి నీలవేణిలకు రాష్ట్రస్థాయి పురస్కారాలు రావడం అభినందనీయమని రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రముఖ కథా రచయిత షేక్‌హుసేన్ సత్యాగ్ని తెలిపారు. ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న రచయితలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ హుసేన్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నంది నాటక పోటీల్లో మల్లికార్జునరెడ్డి రచించిన రాయలసీమ నాటక వికాసానికి పురస్కారం లభించిందని, ఈ గ్రంథం రాయలసీమ నాటక చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకుందని కొనియాడారు. జిల్లాలో అనేక సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు చేస్తూ తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న నీలవేణికి ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ సీఓగా అవార్డు రావడం సంతోషమన్నారు.

జిల్లా రచయితల సంఘానికి చెందిన ఇద్దరికి రెండు రాష్ట్ర స్థాయి పురస్కారాలు రావడం శుభ పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి.హనుమంతరావు, చింతకుంటశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, ప్రతినిధులు భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, భూమిరెడ్డి స్వరూపరాణి, కొప్పోలు రెడ్డిశేఖరరెడ్డి, సాయిప్రసాద్ అనగూరి చంద్రశేఖరరెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, ఎస్.గోపాల్‌రెడ్డి, తవ్వా వెంకటయ్య, కోడూరు స్వతంత్ర బాబు పాల్గొన్నారు.

'దొంగ ఓటు ఐడీల కేసులో ఈడీ పకడ్బందీ చర్యలు'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : ఆంధ్రప్రదేశ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటరు నుంచి ఐఏఎస్‌లు, పౌరుల ఓటర్ల జాబితాలో అజాగ్రత్త, అలసత్వం ప్రదర్శిస్తే ఎవరూ కాపాడలేరని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి మన్నూరు అక్బర్ తెలిపారు. ఆదివారం నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ఓటు హక్కును కాపాడడమేనన్నారు. నజీర్, అబ్దుల్, సలాం, బాబయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలి అరెస్టు

చెన్నూరు, జనవరి 21: అంగన్వాడీ సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లకుండా ముందస్తుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవిని ఆదివారం రాత్రి తన స్వగ్రామం రూకవారిపల్లెలో అరెస్టు చేసి చెన్నూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తూ విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్లవద్దని చెప్పి పంపించారు.

కేక్ కట్ చేసిన యూత్ కాంగ్రెస్ నేతలు

కడప(కలెక్టరేట్), జనవరి 21: విజయవాడలో ఆదివారం వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకుంటున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి సుమంత్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యవంశీ యాదవ్, శ్రీసాయి, చక్రి, ప్రభుకుమార్, శ్యామ్‌కుమార్, వినోద్, చిన్న పాల్గొన్నారు.

'అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలి'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ అధ్యాపక పోస్టులన్నీ భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రావిడ సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ల పోస్టులు కేవలం 47 మాత్రమే చూపిస్తున్నారని, అవికూడా గతంలో మిగిలిన పోస్టులేనన్నారు. తాజాగా ఉన్న ఖాళీలు ఏవీ చూపించలేదన్నారు. ఒక్కో జోన్‌లో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఖాళీ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 240 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇందులో తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలకు సంబంధించించి ఒక్క పోస్టు కూడా ఖాళీ చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సంజీవ్ పాల్గొన్నారు.

టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరుగా చక్రధర్



మడక చక్రధర్

కడప (మారుతీనగర్), జనవరి 21 : తెలుగుదేశం పార్టీ తొగట వీరక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరుగా కడపకు చెందిన మడక చక్రధర్ నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు మడక చక్రధర్ నియామకం జరిగింది. కాగా తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను త్రికరణ శుద్ధిగా పార్టీ అభివృద్ధి కోసం అవిశ్రాంత సేవలందిస్తానని చక్రధర్ తెలిపారు. ముఖ్యంగా చేనేత వర్గాన్ని పార్టీకి మ రింత దగ్గర చేస్తామన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వేంపల్లె, జనవరి 21: ప్రొద్దుటూరులో ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 5వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజి, ఉపాధ్యక్షుడు దస్తగిరిలు పిలుపునిచ్చారు. ఆదివారం వేంపల్లెలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన క్లెయి మ్స్ అన్నిటిని ఆపేయడం దారుణమన్నారు. ప్రమాదశవాత్తు మరణించిన వా రికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు రమేష్‌బాబు, చలపతి, చిన్నటోపి, సిద్దయ్య, బాష పాల్గొన్నారు.

41వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

● కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన



సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప (నాగరాజుపేట), జనవరి 21 : సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించడాన్ని హర్షిస్తున్నామని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, డీవైఎఫ్ఐ నగర నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, అంగన్వాడీ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి అంజనీదేవి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 41 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం జీతాల పెంపు సమస్యను తిరస్కరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్దంగానే సమ్మె చేపట్టామన్నారు. ఇప్పటికే అంగన్వాడీల ఉద్యమం 41రోజులకు చేరిందన్నారు. అంగన్వాడీల న్యాయపర సమస్యల కోసం సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికే చర్చలంటూ తూతూ మం త్రంగా నిర్వహించి మొండిచేయి చూపారన్నారు. మహిళలని కూడా చూడకుండా చిరుద్యోగులపై ఎస్మా చట్టం ప్రయోగించిందని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదరించడం, భయపెట్టడం నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. ఈ విధమైన మొండి వైఖరి సీఎం జగన్‌కు తగదని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పవన్, గిరి, రమణ, అంగన్వాడీ నాయకులు పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ నాయకురాల హౌస్ అరెస్టు

కాగా అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవిని ఆదివారం ఉదయం 6గంటల నుంచి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సమ్మెలో పాల్గొనవద్దని నోటీసులు ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ చట్టంతో కార్మికులకు తీరని అన్యాయం

● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



డైరీని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

కడప(రూరల్) జనవరి 21: విద్యుత్ చట్టంతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పేర్కొన్నారు. ఏఐటీయూసీ అనుబంధమైన ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏపీ గ్రామవార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జడ్పీ సమావేశ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యుత్ చట్టసవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోకపోతే కార్మిక ఆగ్రహజ్వాలలో కొట్టుకుపోతారని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విద్యుత్‌ను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు మోదీ ప్రభుత్వం కుట్రచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ చట్ట సవరణ బిల్లు వల్ల ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తి సరఫరా చేస్తున్న ఉద్యోగస్తులను ఇంటికి పంపడంతో పాటు, దేశ ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుతోందన్నారు. అంతవరకు విద్యుత్ ఉద్యోగులకు చెల్లించే అన్ని రకాల సెలవులను, ఇతర అలవెన్సులను అమలు చేయాలన్నారు. ఏపీ ఎలక్ట్రికల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకాశి, గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. మల్లికార్జునరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఎంతోకాలంగా సాధించుకున్న హక్కులను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గండికొడుతున్నాయన్నారు. కోర్టులు కార్మికులకు అండగా తీర్పులిస్తే వాటిని పక్కన పెట్టి నూతన చట్టాల పేరుతో కార్మిక హక్కులను హరిస్తూ బానిస వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. కృష్ణయ్య, 327 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు జి. చంద్ర, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళి విముక్తి ప్రధాత లెనిన్

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 21 : ప్రపంచ మానవాళి విముక్తి ప్రదాత లెనిన్ అని, ఆయన స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు అన్నారు. ఆదివారం లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ హాలు వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో....

ప్రపంచంలో మొట్టమొదటి సారిగా కార్మిక రాజ్యాన్ని ఏర్పరచి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, అన్వేష్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, సీపీఎం నాయకులు రామక్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీపీ ఆధ్వర్యంలో...

ప్రపంచ వ్యాప్తంగా లెనిన్ చేసిన సేవలను స్మరించుకుంటూ కోట్లాది మంది ప్రజలు లెనిన్ అడుగుజాడల్లో పయనిస్తున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. లెనిన్ శత వర్ధంతి వేడుకలను కాగితాలపెంటలోని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ప్రసాద్ అధ్యక్షతన ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం లెనిన్ వర్ధంతి సభ నిర్వహించారు.

లెనిన్ బాటలో పయనిద్దాం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : సోషలిస్టు కామ్రేడ్ లెనిన్ బాటలో పయనిద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ పేర్కొన్నారు. ఆదివారం లెనిన్ శత వర్ధంతిని పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రష్యాలో లెనిన్ సాధించిన విప్లవ పోరాట స్ఫూర్తి ఆదర్శమైందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించి రష్యాను ప్రపంచానికి దిక్సూచిగా చూపారన్నారు. సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని, అదే లెనిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గణేష్, చోటు దితరులు పాల్గొన్నారు.

టమటంవారిపల్లెలో భవిష్యత్తు గ్యారెంటీ

బి.కోడూరు, జనవరి 21 : మండల పరిధిలోని టమటం వారిపల్లె గ్రామంలో ఆదివారం నియోజకవర్గ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ. రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాల్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు(మైదుకూరు)..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రజలకు వివరించారు. ఆదివారం సాయంత్రం ఆయన దువ్వూరులోని 21వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకలు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, సంజీవరెడ్డి, పుట్టా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల విడుదల

బ్రహ్మంగారిమఠం, జనవరి 21 : బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ఆదివారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడు చేపల పెంపకం చేపట్టి ఆదాయ అభివృద్ధిని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టరు ప్రత్యూష, మత్స్యశాఖ జిల్లా డీడీ శాంతి, మత్స్యశాఖ అధికారి కిరణ్, మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జిల్లా మత్స్యసంఘం అధ్యక్షుడు కందుకూరు సోమయ్య, క్రాస్1కాంట్రాక్టరు రాయపురెడ్డి నరసింహారెడ్డి, వైసీసీ నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



జమ్మలమడుగు, జనవరి 21: జమ్మలమడుగులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ప్రొద్దుటూరు రోడ్డులోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూలు (మార్కెట్) 1987-88 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు సమావేశం అయ్యారు. హైస్కూలు ఆవరణలో పలు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థుల కళయిక సంతోషం, పాత జ్ఞాపకాలు గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఓబుళరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలులో గుంజిళ్లు తీస్తూ నిరసన చేపట్టిన అంగన్వాడీలు



బద్వేలులో గుంజీలు తీస్తూ సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

బద్వేలు రూరల్, జనవరి 21 : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 41వ రోజు చేరింది. సమ్మెలో భాగంగా గుంజీలు తీస్తూ ఓట్లేసి తప్పు చేశామంటూ అంగన్వాడీలు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలు 41 రోజులుగా సమ్మె చేస్తుంటే సమ్మె విరమింపజేసేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దారుణమన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 41వ రోజు ఆదివారం కొండాపురంలో తమ నిరసన ను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ధర్నా కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

మైదుకూరు..: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం కూడా అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 41వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మొండి వైఖరి నశించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా 41వ రోజు సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు భాగ్యమ్మ, నరసమ్మలతోపాటు స్టేషన్‌కు పోలీసులు వచ్చి తీసుకెళ్లినట్లు తెలిపారు. తనతోపాటు ముగ్గురుని పూచీకత్తుపై ఆదివారం సాయంత్రం పోలీసులు పంపించినట్లు ఆయన తెలిపారు.

నోటీసులు జారీ

మైదుకూరు, జనవరి 21 : విజయవాడలో సోమవారం నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకూడదంటూ అంగన్వాడీ కార్యకర్తలకు పోలీసులు 41 నోటీసులు జారీ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ నాయకురాళ్ళు చెన్నమ్మ, రిజ్వానా, క్రిష్ణవేణి, జయశ్రీ, రామతులసీ తదితరులను స్టేషన్‌కు పిలిపించి విజయవాడకు వెళ్లకూడదంటూ 41 నోటీసులు అందించినట్లుఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, ఏవీ శివరాం తెలిపారు.

రాచమల్లు.. అబద్ధాలు మానుకో : వరద



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 21 : కమలాపురంలో రా కదలిరా సభ లక్షలాది మందితో పూర్తి స్థాయిలో విజయవంతం అయితే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి అబద్ధాలు మాట్లాడి తన రాజకీయ విలువలను దిగజార్చుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం సభపై అవాస్తవాలు మాట్లాడతావా అని ఆగ్రహించారు. అందరినీ మాట్లాడినట్లు నన్ను మాట్లాడితే ఊరుకోనని హెచ్చరించారు. కార్యకర్తలను వాహనాలు పెట్టి వారికి భోజనాలు పెట్టి తరలించామన్నారు. అసలు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు ఎన్ని సార్లు అపాయింట్‌మెంటు ఇచ్చారో తెలపాలన్నారు. కనీసం ప్రజల్లో తిరగడానికి కూడా భయపడి పరదాల చాటున తిరుగుతున్నారన్నారు. శివాలయం సర్కిల్లోని కోట్లవిలువైన స్థలంలో టవర్ క్లాక్ నిర్మాణం అక్కరలేదని, దాని వల్ల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు అక్కడ గతంలో వున్నట్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే సంవత్సరానిని 50లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. సమావేంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ వెంకట కొండయ్య ,మాజీ కౌన్సిలర్‌వద్ది బాలుడు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల విద్యాభివృద్ధికి సహకరిస్తాం



మాట్లాడుతున్న ప్రణీత్ నరేంద్ర

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 21 : పేద బ్రాహ్మణుల విద్యాభివృద్ధికి సహకరిస్తామని హైదరాబాద్‌కు చెందిన ప్రణీత్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ప్రణీత్ నరేంద్ర తెలిపారు. ఆదివారం కొత్తరాఘవేంద్రస్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో బ్రాహ్మణ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉన్నత విద్యకు, కోచింగ్ ఫీజుతోపాటు హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. కామరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్టు అందించే పథకాలపై అవగాహన కల్పించారు. రాజకీయ నాయకుడు కాశీభట్ల సత్యసాయినాథ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరి రావు, బ్రాహ్మణ ప్రముఖులు, అర్చకులు పాల్గొన్నారు.

అధ్యాపక ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ అధ్యాపక పోస్టులన్నీ భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రావిడ సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ల పోస్టులు కేవలం 47 మాత్రమే చూపిస్తున్నారని, అవికూడా గతంలో మిగిలిన పోస్టులేనన్నారు. తాజాగా ఉన్న ఖాళీలు ఏవీ చూపించలేదన్నారు. ఒక్కో జోన్‌లో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఖాళీ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా శోభాయాత్ర



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రామ భక్తులు

మైదుకూరు, జనవరి 21 : మైదుకూరులో శ్రీరాముని శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మైదుకూరులో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీరాముని జెండాలు, అయోధ్య అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక మేథాడిఫెన్స్ అకాడమీ వద్ద నున్న ఆంజనేయ స్వామి ఆలయం నుంచి భారీ సంఖ్యలో రామ భక్తులు తమ ద్విచక్రవాహనాల్లో పట్టణంలోని ప్రధాన రహదారులపై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కాగా సోమవారం అయోధ్యలో ప్రతిష్ఠ సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులు వీక్షించేందుకు ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు.

గోపవరం..: మండల పరిధిలో మారుమూల గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో హిందువులందరూ జై శ్రీరామ్ అనే రామమంత్రంతో మారుమోగింది. అయోధ్య నగరంలో భగవాన్ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్న సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు అందుబాటులో ఉన్నాయి. అయోధ్యలో జరిగే స్వామి కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించేందుకు ప్రజలు అత్యంత ఆనందోత్సాహాలతో ఉన్నారు. హిందువులందరికీ ఈ కార్యక్రమం ప్రత్యేక సందడి నెలకొంది.

శ్రీరామ జనసేన ఇంటింటికీ జెండాలు పంపిణీ

పోరుమామిళ్ల, జనవరి 21 :అయోధ్య క్షేత్రంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని గ్రామంలో శ్రీరామ సేన తంబా వీధి, పూలబజారు పురవీధులకు జైశ్రీరామ్ అనే నినాదంతో ఇంటింటికీ జెండాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామసేవ, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు జెండాల పంపిణీలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాములకు పట్టువస్త్రాలు పంపిణీ

ఖాజీపేట, జనవరి 21: మండల పరిధిలోని 20 గ్రామాల్లోని రాముని దేవాలయాలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి పట్టువస్త్రాలు అందజేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి ప్రతి మండలానికి 20 దేవస్థానాలకు పట్టు వస్త్రాలు అందజేశారని, అలాగే రామజన్మభూమిలో జరిగే ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సుబ్రహ్మణ్యం, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల అన్నదానం

కొండాపురం, జనవరి 21 :అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో మండలంలోని పలు రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.అదేవిధంగా కొండాపురం పాతఊరు రామాలయం లో ను, మరికొన్ని చోట్ల రామాలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యతోనే ఉన్నతస్థానం

● బహుమతులు అందించిన తొగటవీర క్షత్రియ సంఘం

జమ్మలమడుగు, జనవరి 21: విద్యతోనే ఉన్నతస్థానాలు చేరుకుంటారని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బడిగించల విజయలక్ష్మి, అహోబిల తొగటవీర క్షత్రియ అన్నదాన సత్రం అధ్యక్షుడు పల్లా శేషయ్య సూచించారు. ఆదివారం జమ్మలమడుగులోని నాలుగుకట్ట వీధి చౌడేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం అత్యధిక మార్కులు ప్రతిభ కనపరచిన వారికి నగదు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ కడప సూపరింటెండెంట్ గొరిగె శివశంకర్ ,తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారు సూర్యనారాయణ, శంకర్, కుండా భాస్కర్, జమ్మలమడుగు అధ్యక్షుడు కవలా రామయ్య, ఆలయ అధ్యక్షుడు గంజికుంట తిరుమల దాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తొగటవీర క్షత్రియ సంఘం నేతలు

ప్రతి ఇంటికీ ఆరు గ్యారెంటీ పథకాలు



తుమ్మలపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి,సీఎం.సురేష్‌నాయుడు

ఎర్రగుంట్ల, జనవరి 21: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి, టీడీపీ నాయకుడు సీఎం.సురేష్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని తుమ్మలపల్లెలో బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో టీడీపీ శ్రేణులు వారికి పూలమాలు వేసి, బాణాసంచా పేల్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించి అందరికి టీడీపీ పథకాల గురించి క్షుణ్ణంగా వవరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సీ.జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు జంబాపురం రమణారెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, సురేంద్రరెడ్డి, సునీల్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టా, సురేష్‌నాయుడు సమక్షంలో చేరికలు



పార్టీలోకి చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎం సురేశ్‌నాయుడు

దువ్వూరు (మైదుకూరు), జనవరి 21 : మండల కేంద్రమైన దువ్వూరులో ఆదివారం రాత్రి టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు సమక్షంలో దాదాపు 50 కుటుంబాలవారు టీడీపీలోకి చేరారు. దువ్వూరుకు చెందిన పెంచకలపాటి వెంకటసుబ్బయ్య నాయుడు, శ్రీరాముల నాయుడు, గొల్లపుడి జయక్రిష్ణ యాదవ్,సీతారామయ్య, రామానాయుడు తదితరులకు చెందిన దాదాపు 50 కుటుంబాల వారిని పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోరెడ్డి వెంకట రమణారెడ్డి, నాయకులు రాంబాబు, సంజీవరెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకులు మల్లోత్ర పాల్గొన్నారు.

పలువురు ముస్లింలు చేరిక...: దువ్వూరులోని 21వ వార్డులో నివాసముంటున్న గొల్లకుంట్ల ఖాదార్‌బాష, చాంద్‌బాష, అసీఫ్. రుక్మాన్ తదితర దాదాపు 20 కుటంబాల వారిని కూడా పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీలోనికి చేర్చుకున్నారు.

బాలాయపల్లెలో..: మండలంలోని బాలాయపల్లెకు చెందిన వైసీపీ నాయకులు రామ్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, బాలయ్య, నరసింహులు, శివాజీ, రామమోహన్,నాగేశ్వరరెడ్డి తదితర కుటుంబాల వారు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరంతా ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి చేరుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి రమణారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ముద్దనూరు జనవరి21: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి బాటపడుతుందని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి పెనికెలపాడు గ్రామంలో ఆదివారం బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, ఎర్రగుంట్ల ఇన్‌చార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణారెడ్డి, గ్రామ నాయకులు బాబు, అంజి, వేణుగోపాల్, శంకర్, సునీల్, సుబ్బారాయుడు, ఎం.నరేష్,ఎం.సురేష్,నరేష్, జనార్దన్, శ్రీను, ఎర్రగుంట్ల, ముద్దనూరు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారంటీ నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల..: చంద్రబాబుతో నే రాష్ట్రాభివృద్ధి అని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఆర్యవైశ్య నగర్‌తో పాటు పలు వీధుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మేనిఫెస్టో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, రామసుబ్బారావు, ఇమాంహుసేన్, సెట్టెం ప్రతాప్, సోమిరెడ్డి, ఓరుగంటి నాగరాజు, గాజులపల్లె రవికుమార్, వెంకటేశ్వర్లు, అతికారి రాజా పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం

కాశినాయన జనవరి21: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బద్వేల్ టీడీపీ అభ్యర్థి బొజ్జారోశన్న, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం బలరాజులపల్లె,కొండపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, రవీంద్రారెడ్డి టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి,వెంకటసుబ్బయ్య,రామిరెడ్డి,చెన్నారెడ్డి,తిరుపేలయ్య,ఓ.రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రోశిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి,బి.నరసింహారెడ్డి, నర్సాపురం సర్పంచ్ ఖాజావలి,క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి,హోండా రవీంద్రారెడ్డి,కొండా రామసుబ్బారెడ్డి,జయన్న,ప్రాన్సీస్ తదితరులు పాల్గొన్నారు.

22 కుటుంబాలు టీడీపీలో చేరిక



ఎగువ రామాపురంలో గ్రామంలో టీడీపీలో చేరిన వారితో విజయమ్మ, రితీష్‌రెడ్డి

కలసపాడు, జనవరి 21 : మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 22 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మీద నమ్మకంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలంటే చంద్రబాబు మరలా సీఎం కావాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రంతు, టీడీపీ నాయకులు రసూల్, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఏపీ రాష్ట్ర భవిష్యత్తు



ఒన్‌టౌన్ సర్కిల్లో ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు జనవరి 21 : టీడీపీతోనే ఏపీ రాష్ట్ర భవిష్యత్తు వుంటుందని చంద్రబాబు నాయకత్వం కే ప్రజల ఆమోదం లభిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఒన్‌టౌన్ సర్కిల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 22 వవార్డు కౌన్సిలర్ వైఎస్ మహమ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జబీవుల్లా, ముజాయిద్దీన్ ఆరిఫ్, మైనుద్దీన్, అమిద్‌బాయ్, గౌస్‌పీర్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

'దొంగ ఓటు ఐడీల కేసులో ఈడీ పకడ్బందీ చర్యలు'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : ఆంధ్రప్రదేశ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటరు నుంచి ఐఏఎస్‌లు, పౌరుల ఓటర్ల జాబితాలో అజాగ్రత్త, అలసత్వం ప్రదర్శిస్తే ఎవరూ కాపాడలేరని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి మన్సూరు అక్బర్ తెలిపారు. ఆదివారం నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ఓటు హక్కును కాపాడడమేనన్నారు. నజీర్, అబ్దుల్, సలాం, బాబయ్య పాల్గొన్నారు.